క్లుప్తంగా

శ్రీవేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వసంత వేణుగోపాల స్వామివారి ఆలయంలో బుధవారం కల్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కల్యాణ మహోత్సవాలు ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగనున్నాయి. బుధవారం ఉదయం 10 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనము, శ్రీ స్వామివారిని పెళ్లి కుమారుడిని చేశారు. అనంతరం తులసి అర్చన చేశారు. సాయంత్రం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా గురువారం స్వామివారికి నిత్యహోమం జరుగును. సాయంత్రం ఆరు గంటలకు శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివార్లకు దివ్య కల్యాణ కార్యక్రమం జరుగును. భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొనాలని ఈఓ సుబ్బారెడ్డి కోరారు.

చినకంచిలో ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



నున్న(విజయవాడరూరల్): శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి దేవస్థానం చినకంచిలో బుధవారం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాచన, అఖండ దీపారాధన, మూలమంత్ర హోమాలు, కలశ స్థాపన నిర్వహించి వేదపండితులు పూజలు చేశారు. తదుపరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి జయంతి సందర్భంగా 108 కలశాల పానకంతో అభిషేకం చేశారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం నిర్వహించారు. భక్తులు స్వామివారికి తలంబ్రాలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదముల పంపిణీ, అన్నసంతర్పణ చేశారు. దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ దంపతులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

చిన్నారులకు వినోద కార్యక్రమాలు



పెనమలూరు: యేసుపాదం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో యానాది పిల్లలకు పలు వినోద కార్యక్రమాలు నిర్వహించామని ప్రాజెక్టు మేనేజర్ జాషువా నీరజ్ తెలిపారు. బుధవారం ఆయన వివరాలు తెలుపుతూ యానాది పిల్లలకు వేసవి కాలం సందర్భంగా వైద్య శిబిరాలతో పాటు పలు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పోరంకి, పెనమలూరు, గోసాల, కంకిపాడు ప్రాంతాల్లో పిల్లలకు ఆటవిడుపుగా క్రికెట్, వాలీబాల్, మ్యూజికల్ చైర్స్ ఇలా పలు క్రీడలు నిర్వహించామని తెలిపారు. యానాది పిల్లలకు మధ్యాహ్నం భోజనం, చల్లని పానీయాలు సమకూర్చామని పేర్కొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



హనుమాన్‌జంక్షన్ రూరల్: భూసారం పెంచేందుకు వీలుగా 2024 ఖరీఫ్ సీజన్‌కు గానూ పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని తెలిపారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని ఆమె ప్రారంభించారు. జనుము, జీలుగ, పిల్లి పెసర విత్తనాలను 50 శాతం సబ్సిడీపై రైతులకు పంపిణీ చేయనున్నట్లు ఏఓ భవాని వివరించారు. మండలంలోని ఆర్బీకేల్లో జీలుగ విత్తనాలు 154.60, జనుము విత్తనాలు 77, పిల్లి పెసర విత్తనాలు 55.88 క్వింటాళ్లు నిల్వ ఉంచినట్లు ఏఓ భవాని తెలిపారు. రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.

నేడు లక్ష తమలపాకుల అర్చన

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం మందిరం క్షేత్ర పాలకుడు శ్రీ పసన్నాంజనేయ స్వామివారికి లోక కల్యాణార్థం లక్ష తమలపాకుల అర్చన నిర్వహించనున్నట్లు మందిర ప్రధాన కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహా వైశాఖి, శ్రీ కూర్మ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని లోక హితం కోరుతూ క్షేత్రపాలక శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి లక్ష తమలపాకుల అర్చన జరుగుతుందన్నారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేస్తారని తెలిపారు.

పచ్చిరొట్ట... పుడమికి జీవం

- చౌడు సమస్యకు చెక్
- సేంద్రియ కర్బనం వృద్ధి
- భూమికి సమృద్ధిగా నత్రజని
- నేల గుల్లబారటంతో దిగుబడులు అధికం
- 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం
- ఆర్‌బీకేలకు చేరిన విత్తనాలు
- పంపిణీకి సిద్ధం చేసిన అధికారులు



ఈడుపుగల్లులో పూర్తయిన దుక్కి పనులు



ఆర్‌బీకేలకు చేరిన పచ్చిరొట్ట విత్తనాలు

కంకిపాడు: పచ్చిరొట్ట పైర్లు..నేలకు అవసరమైన జీవాన్ని అందించే పైర్లు. భూ సారాన్ని పెంపొందించే అద్భుతమైన ఔషధం. పోషకాలు భూమిలో సమృద్ధిగా వృద్ధి చెందడంతో ఆశించిన దిగుబడులు నికరం. భూమిని కాపాడుకోవడం కోసం పచ్చిరొట్ట సాగు చేయాలంటున్నారు వ్యవసాయ శాఖ అధికారులు. ఖరీఫ్ సాగుకు సమాయత్తానికి ముందుగా పచ్చిరొట్ట సాగుచేస్తే సాగు లాభదాయకంగా ఉంటుందంటున్నారు. ఈ మేరకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలను రైతు భరోసా కేంద్రాలకు తరలించారు. అన్నదాతలకు విత్తనాలను పంపిణీ చేసేందుకు కృష్ణాజిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంది.

కృష్ణాజిల్లా వ్యాప్తంగా 25 మండలాల్లో 1.75 లక్షల హెక్టార్లలో వ్యవసాయశాఖ పరిధిలో వివిధ రకాల పంటలు పండుతున్నాయి. ఉద్యానశాఖ పరిధిలో 17,127 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు జరుగుతున్నాయి. 40 హెక్టార్లలో సెరీ కల్చర్ సాగులో ఉంది. దీర్ఘకాలిక పంటలు సాగు చేసిన భూముల్లో మినహా వేసవిలో భూములు అన్నీ ఖాళీగా ఉంటాయి. ఈ సమయంలో రైతులు భూములను ఖరీఫ్‌కు సన్నద్ధం చేసేందుకు సన్నాహాలు చేసుకోవడం పరిపాటి. ప్రధానంగా పొలాల్లో ఉన్న గడ్డి వ్యర్థాలు, పిచ్చికంప తొలగించి మోడును, గడ్డి వ్యర్థాలను తగలబెట్టడం చేస్తారు. వేసవిలో దుక్కులు దున్ని సాగుకు సన్నాహాలు చేసుకుంటారు.

పచ్చిరొట్ట సాగుకు సమాయత్తం..

ఈ సీజన్‌లో రైతులు పచ్చిరొట్ట పైర్లు సాగు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ప్రధానంగా జీలుగ, జనుము, పిల్లిపెసర పైర్లు సాగు చేస్తారు. ఖరీఫ్ సాగు ఆరంభం నాటికి పైరు చేతికి వస్తుంది. పంటను భూమిలో కుళ్లబెట్టి కలియదున్నడం ద్వారా భూమికి అదనపు ప్రయోజనం చేకూరుతుంది. భూమి సారవంతం అవుతుంది. భూమి చౌడుబారితే చౌడు సమస్య నుంచి విముక్తి దొరుకుతుంది. అంతే కాకుండా భూమికి అవసరమైన సేంద్రియ కర్బనం వృద్ధి చెందుతుంది. నత్రజని అందుతుంది. సూక్ష్మపోషకాలు సమృద్ధిగా పంటకు అందుతాయి. నేల గుల్లబారుతుంది. పచ్చిరొట్ట పైరు సాగుతో తదుపరి పంట సాగులో అధిక దిగుబడులు, నాణ్యతాయుతంగా పొందేందుకు ఆస్కారం ఉంటుంది. దీంతో రైతులు పచ్చిరొట్ట సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

సిద్ధమైన వ్యవసాయశాఖ..

రైతుల అవసరాలకు అనుగుణంగా ఆయా ప్రాంతాలకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేసేందుకు జిల్లా వ్యవసాయశాఖ అన్ని చర్యలూ తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా జీలుగ 3,303 క్వింటాళ్లు, పిల్లిపెసర 699 క్వింటాళ్లు, జనుము 547 క్వింటాళ్లు సరఫరా చేయనుంది. రైతులకు 50 శాతం రాయితీపై విత్తనాలను అందించనుంది. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలను ఆయా మండలాల్లోని వ్యవసాయశాఖ నివేదికల ఆధారంగా విత్తనాలను స్థానిక రైతుభరోసా కేంద్రాలకు తరలించింది. ఒకటి, రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని చేపట్టి త్వరితగతిన పూర్తి చేసేందుకు మార్గదర్శకాలను సైతం జారీ చేసింది.

పచ్చిరొట్టతో మేలు



పచ్చిరొట్ట పైర్లతో భూమికి మేలు చేకూరుతుంది. చౌడు సమస్యను అధిగమించొచ్చు. ఆశించిన దిగుబడులు వస్తాయి. ఎరువుల మోతాదు తగ్గించుకోవచ్చు. తద్వారా పెట్టుబడి వ్యయాన్ని అధిగమించొచ్చు. పచ్చిరొట్ట సాగుతో తదుపరి పంట సాగులో ఆశించిన దిగుబడులు పొందడానికి అవకాశం ఉంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్న పచ్చిరొట్టను ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎన్.పద్మావతి, జిల్లా వ్యవసాయాధికారి, కృష్ణాజిల్లా

అక్కచెల్లెమ్మలకు చేయూత

- తాడిగడప మున్సిపాలిటీలో వైఎస్సార్ చేయూత రూ. 54.74 కోట్లు
- 28,917 మందికి చేకూరిన లబ్ధి

పెనమలూరు: పేద, మధ్య తరగతి మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ చేయూత పథకం తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో నివశిస్తున్న మహిళలను ఆర్థికంగా ఆదుకుంది. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో చేయూత పథకం ద్వారా 28,917 మంది మహిళలకు రూ. 54.74 కోట్లు లబ్ధిచేకూరింది. వివరాల్లోకి వెళితే పేద, మధ్య తరగతి అక్కచెల్లెమ్మలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేయూత పథకం అమలులోకి తీసుకువచ్చారు. 45 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన పేద మహిళలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏడాదికి ఒకొక్కరికి రూ. 18,750 చొప్పున నాలుగు సంవత్సరాలు అర్హులైన మహిళలను ఆర్థికంగా జగనన్న ఆదుకున్నారు. ప్రతీ ఏడాది పేద, మధ్య తరగతి మహిళలకు కుల మతాలతో సంబంధం లేకుండా ఆర్థిక సాయం అందించి వారి జీవితల్లో వెలుగులు నింపారు. తాడిగడప మున్సిపాలిటీలో చేయూత పథకం కింద అనేక మంది పేద మహిళలు లబ్ధిపొందారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 19 గ్రామ సచివాలయాల ద్వారా గత నాలుగు సంవత్సరాలుగా మహిళలు చేయూత పథకం ఫలాలు అందుకున్నారు. గత రెండు నెలల క్రితమే మహిళలకు చేయూత సొమ్ము అందాల్సి ఉంది. కానీ ఎన్నికల కోడ్‌ను కారణంగా చూపి ప్రతిపక్షాలు కుట్రలు పన్ని అడ్డుకున్నాయి. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా ఎన్నికల తర్వాత ఇచ్చి మాట ప్రకారం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నేరుగా మహిళల ఖాతాల్లో సొమ్ము జమ చేసింది. ప్రభుత్వం అందించిన సాయం పట్ల మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాడిగడప మున్సిపాలిటీలో గత నాలుగు సంవత్సరాలుగా చేయూత ద్వారా అందిన వివరాలు ఇలా ఉన్నాయి.

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం
2020-2021	7,486	రూ. 14.04 కోట్లు
2021-2022	7,899	రూ. 14.81 కోట్లు
2022-2023	8,196	రూ. 15.39 కోట్లు
2023-2024	5,336	రూ. 10.50 కోట్లు
	28,917	రూ. 54.74 కోట్లు

జగనన్న సాయం మరువలేనిది



వైఎస్సార్ చేయూత ద్వారా సీఎం జగనన్న అందించిన ఆర్థిక సాయం ఎన్నటికి మరువలేనిది. ఎన్ని ఆటంకాలు వచ్చిన ఇచ్చిన మాట ప్రకారం సొమ్ము మా బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. గత నాలుగు సంవత్సరాలుగా చేయూత అందింది.

– నడకుదుటి రంగనాయకమ్మ, యనమలకుదురు



చేయూత లబ్ధిదారులు (ఫైల్)

పుస్తక పఠనంతో మేధో వికాసం



తెన్నేరు శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖనం శిక్షణలో చిన్నారులు



పురుషోత్తపట్నంలో తాడు లాగుడు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



వణుకూరు గ్రంథాలయంలో విద్యార్థులు



ఉయ్యూరులో లెమన్ స్పూన్ ఆడుతున్న చిన్నారులు

గన్నవరం రూరల్: పుస్తక పఠనంతో విద్యార్థుల్లో మేధో వికాసం కలుగుతుందని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, తాడు లాగుడులో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్న నాటి నుంచి తల్లిదండ్రుల పర్యవేక్షణలో చదువుతో పాటు ఆటల్లో సైతం రాణించాలని ఆకాంక్షించారు. సెల్‌ఫోన్‌లు, టీవీలకు దూరంగా విద్యార్థులను ఉంచేందుకు ఈ వేసవిలో సమ్మర్ క్యాంపు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. పుస్తకాలు చదవడం వల్ల ఏకాగ్రత, దూరదృష్టి, సమాజ పరిస్థితులపై అవగాహన ఏర్పడతాయని వివరించారు. తాడు లాగుడు పోటీలో విజేతలను పాఠకులు, గ్రామస్తులు అభినందించారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖనం, చెస్ పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ కె.జ్యోతి కుమారి ఆధ్వర్యంలో సీనియర్స్, జూనియర్స్ విభాగంలో నీతి కథలు చెప్పించారు. నీతి కథలు విద్యార్థుల్లో నైతిక ప్రవర్తనకు దోహదపడతాయని ఆమె తెలిపారు. పాఠకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చిత్రలేఖనంపై ఆసక్తి పెంచుకోవాలి

కంకిపాడు: చిత్రలేఖనంపై ఆసక్తి పెంచుకోవాలని తెన్నేరు శాఖా గ్రంథాలయాధికారి ఎస్.సునీత అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యాన తెన్నేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతోంది. బుధవారం చిన్నారులకు చిత్రలేఖనంలో శిక్షణ, భగవద్గీత పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు, సృజనాత్మక అంశాలు కూడా ముఖ్యమేనన్నారు. ప్రతి ఒక్కరూ వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెనమలూరు: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా వణుకూరు శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. తొలుత విద్యార్థులకు పుస్తక పఠనం, అనంతరం మ్యూజికల్ చైర్, పాటల పోటీలు నిర్వహించామని గ్రంథాలయ అధికారిణి భారతి తెలిపారు. గురువారం విద్యార్థులకు పద్యాల పోటీలు ఉంటాయన్నారు. పెనమలూరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి హర్షిత ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

ఉయ్యూరు: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఉయ్యూరు గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. లెమన్ స్పూన్, క్యారమ్స్, చెస్, ఖోఖో పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రీసోర్సు పర్సన్ పవన్‌కుమార్ ప్రతిభ చాటిన విద్యార్థులను ఎంపిక చేశారు. పోటీలను గ్రంథాలయాధికారి బి.రమణి పర్యవేక్షించారు.

రాజ్యాంగంపై అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. వేసవి సెలవుల నేపథ్యంలో చిన్నారులకు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ రకాల అంశాలపై గ్రంథాలయంలో శిక్షణ కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. కథలు చెప్పడం, కథలు చదవడం, జనరల్ నాలెడ్జ్, నృత్యాలు, చెస్, క్యారమ్స్ వంటి ఇండోర్ గేమ్స్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగి ఎస్.బాబురావు భారత రాజ్యాంగం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. లైబ్రేరియన్ స్వర్ణ లతాదేవి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కోడెబోయిన బాబి పాల్గొన్నారు.

నేడు గన్నవరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు గన్నవరం సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వహణ ఇంజినీర్ పి.హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక హరిజనవాడ, ఉపాధ్యాయనగర్, రీచ్‌స్కూల్ రోడ్డు, సాయినగర్, చర్చిరోడ్డు, రాయ్‌నగర్, రెడ్డిమెస్ బజార్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఏరియా, గ్రామపంచాయతీ ఆఫీస్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

వృద్ధుడి మృతిపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న గ్రామం మదర్ థెరిస్సా ఆశ్రమం వద్ద వృద్ధుడి మృతిపై స్థానిక వీఆర్వో బి.శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నున్న మదర్ థెరిస్సా ఆశ్రమం వద్ద బల్లపై మంగళవారం 60 ఏళ్ల వృద్ధుడి శవం ఉన్నట్టు స్థానికులు వీఆర్వోకు సమాచారం అందజేశారు. వీఆర్వో శవాన్ని పరిశీలించగా, మృతుని జేబులో ఆధార్ కార్డు లభించింది. ఆ వివరాల ప్రకారం మృతుడు తివారీ బాల దుర్గారామ్‌సింగ్, భీమన్న వారి వీధి, వన్‌టౌన్, విజయవాడకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. వృద్ధుని ఎడమ కాలు కింది భాగం తీసి వేయబడి ఆస్పత్రి బ్యాండేజి కాలికి కట్టి ఉంది. స్కై బ్లూ కలర్ టీ షర్టు, లుంగీ ధరించి ఉన్నాడు. మృతునికి సంబంధించిన వారు ఎవరైనా నున్న పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ ఎస్.దుర్గాప్రసాద్ తెలిపారు.

కృష్ణా మిల్క్ యూనియన్‌ను అగ్రగామిగా నిలపడమే లక్ష్యం

హనుమాన్‌జంక్షన్ రూరల్: కృష్ణా మిల్క్ యూనియన్‌ను దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రణాళికబద్ధంగా నిస్వార్థంతో పని చేస్తున్నానని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి ఐదేళ్లు పూర్తి అయిన సందర్భంగా చలసానిని పాలకమండలి సభ్యులు, పాల సొసైటీ అధ్యక్షులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. స్థానిక విజయవాడరోడ్డులోని కాకాని వెంకటరత్నం పాల ఉత్పత్తిదారుల భవనంలో బుధవా రం జరిగిన ఈ కార్యక్రమంలో చలసాని మాట్లా డుతూ గడిచిన ఐదేళ్లలో కృష్ణా మిల్క్ యూనియన్ పురోగాభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన కేక్ కట్ చేశారు. చలసానిని ఘనంగా సత్కరించారు. యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పాలక మండలి సభ్యులు, మాజీ ఎమ్మెల్యేలు దాసరి బాలవర్ధనరావు, ఎర్నేని సీతాదేవి, పలువురు పాల సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

కానూరులో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం



కానూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పెనమలూరు: కానూరులో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన బుధవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివరాలు తెలుపుతూ పర్యావరణ కాలుష్యం కారణంగా భూగోళం వేడెక్కి మానవాళికి సమస్యగా మారుతుందన్నారు. దీంతో జీవవైవిధ్యం దెబ్బతింటుందని తెలిపారు. ఎన్నో జీవజాతులు అంతరించి పోతున్నాయని ఆందోళణ వ్యక్తం చేశారు. నేడు పిచ్చుకలు కనబడటం లేదన్నారు. ప్రపంచంలో 12 మహా జీవవైవిధ్య ప్రాంతాల్లో మన దేశం కూడా ఒకటని, సుమారు 45 వేల పక్షిజాతులు, 77 వేల జంతు జాతులు ఉన్నాయన్నారు. ఇప్పుడు అవి అంతరించి పోతూ ప్రమాదంలో ఉన్నాయని పేర్కొన్నారు. వన్యప్రాణులను వేటాడి చంపుతున్నారని, పంటల సాగులో కీటకాల నివారణకు రసాయన ఎరువులు వాడటంతో పక్షిజాతులు అంతరించిపోతున్నాయని తెలిపారు. జీవవైవిధ్యం ఉండాలంటే ప్రపంచ దేశాలు భూమిపై 33 శాతం అడువులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

వేటూరి పాట తెలుగు సాహిత్యపు పూదోట



వేటూరి విగ్రహానికి నివాళులర్పించిన గోళ్ల నారాయణ రావు, చక్రవర్తి, గణపతిరావు, చిట్టిబాబు తదితరులు

విజయవాడకల్చరల్: వేటూరి పాట తెలుగు సాహిత్యపు పూదోట అని కామ్రేడ్ జీఆర్కే, పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. కామ్రేడ్ జీఆర్కే, పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి, సాంస్కృతిక సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సాహితీవేత్త, పరిశోధకుడు, సినీ పాటల రచయిత వేటూరి సుందర రామ్మూర్తి విగ్రహం వద్ద ఆయన 14వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. విగ్రహానికి నివాళి అందించిన అనంతరం గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన కవి వేటూరి అని అన్నారు. వేటూరి సాహిత్య పరిశోధకుడు డాక్టర్ జయంతి చక్రవర్తి మాట్లాడుతూ.. వేటూరి ఓ సీత కథతో సినీ రంగ ప్రవేశం చేశారని, 15 వేలకు పైగా పాటలను రచించారని తెలిపారు. వేటూరి చాలా రకాలైన పాటలు రాశారని సంప్రదాయ కవిత్వం దగ్గర నుంచి జానపద గీతాల వరకు ఆయన ముద్ర కనిపిస్తుందన్నారు. రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే పాటకు 1994లో జాతీయ పురస్కారం లభించిందని తెలిపారు. వర్ధంతి కార్యక్రమంలో జానపద గాయకుడు దామోదర గణపతిరావు, చింతకాయల చిట్టిబాబు, చలపతిరావు, శ్యాం ప్రసాద్, ఆదిరాల జయప్రభు, ప్రిన్స్‌తో పాటు వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విజయవంతంగా లింబ్ సాల్వేజ్ సర్జరీ

పటమట(విజయవాడతూర్పు): కుడి ముంజేయి పునరావృత సైనోవియల్ సార్కోమాతో బాధపడుతున్న 42 ఏళ్ల మహిళా రోగికి లింబ్ సాల్వేజ్ సర్జరీని విజయవంతంగా నిర్వహించామని అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్(ఏఓఐ) సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఇషాంత్ అయినపూరి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైనోవియల్ సార్కోమా అనేది కీళ్ల చుట్టూ ఉన్న కణజాలాన్ని ప్రభావితం చేసే అరుదైన క్యాన్సర్ రూపమని, ఇది సాధారణంగా తుంటి, మోకీలు, చీలమండ లేదా భుజంలో వస్తుందన్నారు. రోగి గతంలో వివిధ ఆస్పత్రుల్లో మూడు శస్త్రచికిత్సలు చేయించుకున్నారని, ఆయా హాస్పిటల్స్ చేతిని తొలగించాల్సిందిగా సిఫార్సు చేయడంతో పాటు తదుపరి శస్త్రచికిత్స అసాధ్యంగా పరిగణించాయన్నారు. అయితే తమ వద్ద రోగికి కీమోథెరపీ చికిత్సలతో ప్రారంభించామని, అనంతరం సంక్లిష్ట శస్త్రచికిత్సను నిర్వహించామన్నారు. ధమని పునర్నిర్మాణం కోసం రోగి ఎడమ కాలు సఫేనస్ నరాన్ని ఉపయోగించామని చెప్పారు. ఉల్నార్ నరాల పునర్నిర్మాణం కోసం రోగి ఎడమ కాలు సురల్ నరాన్ని వినియోగించామన్నారు. శస్త్రచికిత్స అనంతరం ఆమె చేతి కదలిక సాధారణంగా వచ్చిందని, ప్రస్తుతం ఫిజియోథెరపీ చేయించుకుంటున్నారని తెలిపారు.

అలరించిన సినీ సంగీత విభావరి



వేటూరి చిత్ర గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

విజయవాడకల్చరల్: గీతాంజలి మ్యూజికల్, సుశీల్ మీడియా, వేదగంగోత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి 14వ వర్ధంతిని పురస్కరించుకుని విజయవాడ గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. డాక్టర్ జయంతి చక్రవర్తి ఆధ్వర్యంలో గాయనీ గాయకులు సుశీల్, మల్లాది స్వాతి, భారతి, భాగ్యశ్రీ, రూపశ్రీ, తులసి, శివశర్మ, రాజ్ కిషోర్, దామోదర గణపతిరావు తదితరులు వేటూరి సినీ పాటలను మధురంగా ఆలపించారు. సుప్రీం కోర్టు న్యాయవాది వరప్రసాద్ మాట్లాడుతూ.. బహుముఖ ప్రతిభాశాలి వేటూరి సుందరరామ్మూర్తి అని అభివర్ణించారు. ఆయన సినీ గేయరచయిత మాత్రమే కాదని పలు గ్రంథాలను రచించారన్నారు. ఆయన 8 నంది పురస్కారాలు అందుకున్నారని శ్రీశ్రీ తర్వాత తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన కవి వేటూరి అని తెలిపారు. సాహితీ సంస్థల ప్రతినిధులు పి.విజయలక్ష్మి, ప్రసూనా రామన్, వెంకాయమ్మ, బి.వీరభద్రరావు, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అతిథులు వేటూరి చిత్రపటానికి నివాళులర్పించారు.

ఘనంగా రాజా రామ్మోహన్‌రాయ్ జయంతి



రాజా రామ్మోహన్ రాయ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ కమిటీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్ రాయ్ 252వ జయంతి వేడుకలు విజయవాడ బందరు రోడ్డులోని రామ్మోహన గ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత రాజా రామ్మోహన్‌రాయ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. రాజా రామ్మోహన్ రాయ్ గొప్ప సంఘ సంస్కర్త అని పేర్కొన్నారు. ఆయన సతీసహగమన సాంఘిక దురాచారాన్ని రూపుమాపడానికి ఎంతో కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉపాధ్యక్షులు దమ్మాల రామచంద్రరావు, నాగభూషణం, మాధవరావు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.